క్లుప్తంగా

20న ఉచిత వైద్యశిబిరం

నల్లగొండ టౌన్ : పట్టణంలోని నర్రా రాఘవ రెడ్డి స్మారక ప్రజావైద్యశాలలో ఎంవీఎన్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 20న ఉదయం 7గంటల నుంచి 11వరకు షుగర్, బీపీ, ఫిట్స్, పక్షవాతం రోగులకు ఉచిత వైద్యశిబిరం నిర్వహించనున్నట్లు ట్రస్టు కార్యనిర్వాహక కార్యదర్శి పి.నర్సిరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శిబిరానికి వచ్చే వారు ప్రస్తుతం వాడుతున్న మందులు, వైద్యపరీక్షల రిపోర్టులు తీసుకుని రావాలని కోరారు.

నూతన ఉపాధ్యాయుల నియామకం

నార్కట్‌పల్లి : మండలానికి 23మంది నూతన ఉపాధ్యాయులను ప్రభుత్వం నియమించినట్లు ఎంఈఓ నర్సింహ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్కూల్ అసిస్టెంట్‌లు ముగ్గురు, స్కూల్ సెకండరీ టీచర్స్ 15మంది, ఎల్‌పీటీ ఒక్కరు, ఎల్‌పీహెచ్ ముగ్గురి గాను గురువారం 21మంది విధుల్లో చేరారని తెలిపారు. మండలంలో మొత్తం 219 ఉపాధ్యాయులు ఉన్నట్లు తెలిపారు.

కేటీఆర్‌ను కలిసిన శ్రీనివాస్


కేటీఆర్‌ను కలిసిన శ్రీనివాస్

కనగల్ : బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర కమిటీ సమావేశాలు హైదరాబాద్‌లో గురువారం నిర్వహించారు. ఈ సమావేశానికి వెళ్లిన మండలానికి చెందిన బీఆర్‌ఎస్‌వీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, తెలంగాణ ఉద్యమకారుడు కట్టా శ్రీనివాస్ కేటీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.

మండల విద్యాధికారిగా పద్మ



ఎంపీడీఓ కార్యాలయంలో రిపోర్ట్ చేస్తున్న వల్లపట్ల పద్మ

కనగల్ : మండలంలోని చినమాదారం ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న వల్లపట్ల పద్మ మండల విద్యాధికారిగా గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో రిపోర్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి పనిచేస్తూ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందేవిధంగా చూస్తానన్నారు. ఆమె వెంట పీఆర్టీయూ మండల అధ్యక్షుడు ఏమిరెడ్డి సైదిరెడ్డి, కత్తుల చంద్రశేఖర్ రెడ్డి, ఉపాధ్యాయులు రఫత్‌అలీ, నన్నూరి మురళీమోహన్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, సుదర్శన్, శ్రీనివాస్, క్లస్టర్ రిసోర్స్‌పర్సన్‌లు తిరందాసు సంతోష్‌కుమార్, ప్రవీణ్, రఫీ, లక్ష్మి, వేణు తదితరులు ఉన్నారు.

ఎన్నికల కోసమే మద్దతు ధర ప్రకటన

కేతేపల్లి : పలు రాష్ట్రాలలో త్వరలో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల్లో లబ్ధి పొందేందుకే కేంద్రంలో అధికారంలో ఉన్న ఎన్‌డీఏ ప్రభుత్వం ఆరు పంటలకు మద్దతు ధర ప్రకటించిందని కాంగ్రెస్ కిసాన్‌సెల్ రాష్ట్ర కోఆర్డినేటర్ అలుగుబెల్లి మహేందర్‌రెడ్డి ఆరోపించారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో రైతులు అత్యధికంగా పండించే వరి, పత్తి, మిర్చి పంటలకు కేంద్రం ప్రకటించిన మద్దతు ధరలో చోటు కల్పించకపోవడం అన్యాయమన్నారు. స్వామినాధన్ కమీషన్ చేసిన సిఫారుసు మేరకు వరికి రూ.2800 మద్దతు ధర ప్రకటించాలని డిమాండ్ చేశారు.

వైభవంగా గీతా జ్ఞానయజ్ఞం


ఆలయంలో అన్నప్రసాదం అందజేస్తున్న ఆలయ చైర్మన్ అనంతరెడ్డి దంపతులు

నాంపల్లి : మండల కేంద్రంలోని ఉమానాగలింగేశ్వరస్వామి ఆలయంలో ఆలయ చైర్మన్ పెద్దిరెడ్డి అనంతరెడ్డి ఆధ్వర్యంలో శ్రీలక్ష్మీరామకోటి 100వ గీతా జ్ఞానయజ్ఞాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. అనంతరం భక్తులకు ఆలయ చైర్మన్ దంపతులు అన్నప్రసాదం నిర్వహించారు. యజ్ఞంలో పాల్గొన్న గురూజీలు దయానంద సతీమణి రాధానందతో పాటు పలువురు గురూజీలను సన్మానించారు. కార్యక్రమంలో గీతా యజ్ఞం కమిటీ సభ్యులు సంగెపు పరందాములు, కామనబోయిన ఈశ్వరయ్య, కామిశెట్టి శ్రీకాంత్, కైలాసమ్మ, ఎరెడ్ల నర్సిరెడ్డి, మనోహరమ్మ, చెన్నయ్య, భక్తులు మాల్ మార్కెట్ డైరెక్టర్ పూల యాదగిరి, గిరి, శేఖర్, చక్రి శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

'సీసీఐ' ఏర్పాటు చేయాలి

నల్లగొండ టౌన్ : జిల్లాలో సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రాలను వెంటనే ఏర్పాటు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలో అయిదున్నర లక్షల ఎకరాల్లో పత్తి పంటను సాగు చేశారని సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడంతో రైతులు గ్రామాల్లో దళారీలకు తక్కువ ధరకు పత్తి అమ్ముకుంటూ నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

కానరాని 'పల్లెవెలుగు'..!

- గ్రామాలకు రాని ఆర్టీసీ బస్సులు
- ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్న ప్రయాణికులు
- రెట్టింపు చార్జీలు వసూలు చేస్తున్న ఆటోవాలాలు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న ప్రజలు


శాలిగౌరారంలో ప్రయాణికుల కోసం వేచి ఉన్న ఆటోలు

శాలిగౌరారం : గ్రామీణ ప్రాంత ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని గతంలో పలు గ్రామాలకు ఆర్టీసీ అధికారులు పల్లెవెలుగు పేరుతో ఆర్టీసీ బస్సు సర్వీసులను నడిపించారు. ప్రస్తుతం ఆ పరిస్థితిలేకుండా పోయింది. గ్రామాలకు గతంలో ఉన్న పల్లెవెలుగు బస్సుల సేవలు నిలిచిపోయాయి. దీంతో విద్యార్థులు, ఉద్యోగులు, వివిధ కూలి పనులకు ఇతర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడాల్సివస్తుంది. శాలిగౌరారం మండలంలోని అన్ని గ్రామాలకు రోడ్డు సౌకర్యాలు మెరుగ్గా ఉన్నా బస్సులు రాని పరిస్థితి నెలకొంది. దీంతో మండల ప్రజలు ఇటు ప్రజాప్రతినిధులకు, అటు ఆర్టీసీ అధికారులకు విన్నవించినా ఫలితంలేకుండా పోయింది. ఈ సమస్య ఇప్పుడే కాదూ గత మూడు సంవత్సరాలుగా మండల ప్రజలను, ప్రయాణికులను వేధిస్తూనే ఉంది.

నాడు 22ట్రిప్పులు.. నేడు ఒక్క ట్రిప్పు లేదు..

మండలంలో మొత్తం 24గ్రామపంచాయతీలు ఉండగా ప్రతీ గ్రామానికి బస్సు సౌకర్యం ఉండే విధంగా రోజుకు 22ట్రిప్పులు ఆర్టీసీ బస్సులు నడిచేవి. గత రెండు సంవత్సరాలుగా ఆ సంఖ్య సింగిల్ డిజిట్‌కు పరిమితం కాగా ప్రస్తుతం అది కూడా లేకుండా పోయింది. మండలానికి నల్లగొండ, నార్కట్‌పల్లి, సూర్యాపేట ఆర్టీసీ డిపోల నుంచి బస్సులు నడిచేవి. అందులో నకిరేకల్ నుంచి శాలిగౌరారం, గురుజాల, మనిమద్దె, అమ్మనబోలు, చిత్తలూరు(గోల్), అంబారిపేట, ఊట్కూరు, ఇటుకులపహాడ్ గ్రామాల సర్వీస్‌లతో పాటూ సూర్యాపేట నుంచి వయా నకిరేకల్, శాలిగౌరారం, అమ్మనబోలు, మోత్కూరు మీదుగా హైదరాబాద్ (జగద్గిరిగుట్ట)కు రెండు ప్రత్యేక సర్వీసులు నడిచేవి. ప్రస్తుతం ఒక్క సర్వీసు కూడా లేకపోవడంతో మండల ప్రజలు ప్రయాణపరంగా పడుతున్న బాధలు వర్ణనాతీతం. ఆటోలు ఎక్కువ కావడం.. ఆర్టీసీకి ప్రయాణికుల నుంచి ఆదరణ తగ్గడంతో ఆక్యూపెన్సీ పెరగడంలేదని, కనీసం డీజిల్‌కు సరిపడా కూడా ప్రయాణికులు ఆర్టీసీ బస్సులలో ప్రయాణించడంలేదంటూ ఆర్టీసీ అధికారులు బస్సులను కాలానుక్రమంగా తగ్గిస్తూ ప్రస్తుతం పూర్తిగా నిలిపివేశారు.

మండలంలో 220 ఆటోలు..

మండలంలో ప్రస్తుతం 220ఆటోలు నడుస్తున్నాయి. ప్రయాణికుల రద్దీని బట్టీ ఒక్కొక్క ఆటో ఒకటి నుంచి రెండు ట్రిప్పులు ఆయా ప్రాంతాలకు నడిపిస్తున్నారు. ఒక్కరోజులో ఆటోలు నడిచే ట్రిప్పుల సంఖ్య సుమారు 450కి పైగానే ఉంటాయి.

రెట్టింపు చార్జీలు వసూలు..

ఆటోల సంఖ్య పెరుగడం.. ఆర్టీసీ బస్సులు పూర్తిగా రాకపోవడంతో ఆటో యజమానులకు అందివచ్చిన అవకాశంగా మారింది. ఆటోలు సంఖ్య కూడా అధికం కావడం డీజిల్ ధర సెంచరీకి దగ్గర కావడంతో పాటూ సరిపడా ట్రిప్పులు రాకపోవడంతో ఆటో యజమానులు చార్జీల ధరలను ఆర్టీసీ చార్జీలకు రెట్టింపు చార్జీలు వసూలు చేస్తున్నారు. అదేవిధంగా ఆటోలలో సామర్థ్యానికి మించి ప్రయాణికులను ఎక్కించి ప్రమాదకర పరిస్థితుల నడుమ ఆటోలను నడుపుతున్నారు. ఆర్టీసీ అధికారులు బస్సులను నడిపినా బస్టాప్‌లలో బస్సుల కోసం వేచిచూసే ఓపిక ప్రయాణికులకు లేకపోవడం, పది మంది కాగానే ఆటో ప్రయాణికులతో వెళ్లడం, ప్రజలు ఎక్కువగా ద్విచక్రవాహనాలపై ప్రయాణించడంలాంటి కారణాలతో బస్సులు పూర్తిగా బంద్ కావడానికి దోహదం చేస్తున్నాయనడంలో ఏలాంటి సందేహం లేదు. ఇప్పటికైనా ప్రయాణికుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆర్టీసీ అధికారులు ప్రతీ గ్రామానికి బస్సు సర్వీసు నడపాలని ప్రజలు కోరుతున్నారు.

బస్సు సర్వీసులు నడిపేలా చూడాలి



మండలంలోని ఏగ్రామానికి కూడా నేడు ఆర్టీసీ బస్సు సర్వీస్ లేకపోవడంతో ప్రజలు ప్రయాణాలు చేసేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళల్లో అయితే పరిస్థితి మరీ దారుణంగా ఉంటుంది. బస్సులు లేకపోవడంతో ప్రయాణాలు చేయాలంటే సొంత వాహనాలే గతి. సొంత వాహనాలు లేని మారుమూల గ్రామాల ప్రజలు ఆటోలు రాని సమయంలో కాలినడకన ప్రయాణిస్తూ నానా అవస్థలు పడుతున్నారు. అధికారులు స్పందించి గ్రామాలకు బస్సులు వచ్చేలా చూడాలి.

– నిమ్మల వీరస్వామి,
రామగిరి, శాలిగౌరారం

వైభవంగా శ్రీవేణుగోపాలస్వామి కల్యాణం


ఆలయంలో పూజలు చేస్తున్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే వీరేశం

చిట్యాల : మండలంలోని వట్టిమర్తి గ్రామంలో శ్రీవేణుగోపాలస్వామి కల్యాణోత్సవాన్ని గురువారం ఆలయ చైర్మన్ నర్రా మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారి తిరుకల్యాణోత్సవాన్ని ఆలయ అర్చకుడు అక్కెనపల్లి భీష్మాచారి వేదమంత్రోచ్చరణలతో రంగరంగ ఘనంగా నిర్వహించారు. ఉత్సవాల్లో పాల్గొన్న భక్తులు ఉత్సవమూర్తులకు వడిబియ్యం పోశారు. అనంతరం ఉత్సవ నిర్వాహకులు భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

శాసనమండలి చైర్మన్, ఎమ్మెల్యే పూజలు..

శ్రీవేణుగోపాల స్వామి కల్యాణోత్సవంలో రాష్ట్ర శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశం, చిట్యాల మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి చినవెంకట్‌రెడ్డి పాల్గొని ఉత్సవ విగ్రహాల వద్ద, ఆలయంలోని శ్రీకృష్ణుడి మూల విరాట్ వద్ద ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారిని ఆలయ చైర్మన్ నర్రా మోహన్‌రెడ్డి శాలువాతో సత్కరించారు. అనంతరం భక్తులకు ఏర్పాటు చేసిన అన్నప్రసాద వితరణను వారు ప్రారంభించారు. కార్యక్రమంలో డీసీసీ కార్యదర్శి పోకల దేవదాసు, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గుడిపాటి లక్ష్మీనర్సింహ, ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు వనమా వెంకటేశ్వర్లు, పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు బోడ స్వామి, నాయకులు కర్నాటి ఉప్పల వెంకట్‌రెడ్డి, బట్టు అయిలేష్, మాజీ సర్పంచ్ బుర్రి రవీందర్‌రెడ్డి, మాజీ ఉపసర్పంచ్ సాగర్ల నరేష్ తదితరులు పాల్గొన్నారు.

బాలల పరిరక్షణపై అవగాహన


మాట్లాడుతున్న సూపర్‌వైజర్ ముమ్మడి యశోద

మర్రిగూడ : మండలంలోని దామెరబీమనపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో చింతపల్లి ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం బాలల పరిరక్షణపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ముమ్మడి యశోద మాట్లాడుతూ.. బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని, 18ఏళ్లు నిండకముందే బాలికలకు వివాహాలు చేస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. అదే విధంగా బాలికలపై లైంగిక వేధింపులు, లింగ వివక్షత, బాల కార్మికులు, అక్రమ దత్తత, చైల్డ్ హెల్ప్ లైన్ 1098పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సంజీవ్‌రావు, లచ్చిరామ్, సిబ్బంది రాము, అంగన్‌వాడీ టీచర్లు, విద్యార్థులు ఉన్నారు.

మానవ పరివర్తనకు వాల్మీకి జీవితం నిదర్శనం


రామగిరి (నల్లగొండ) : విగ్రహ ఆవిష్కరణలో పాల్గొన్న శంకర్‌నాయక్, బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, మోహన్‌రెడ్డి

రామగిరి(నల్లగొండ) : మానవ పరివర్తనకు వాల్మీకి జీవితం నిదర్శనమని డీసీసీ అధ్యక్షుడు శంకర్ నాయక్ అన్నారు. గురువారం వాల్మీకి జయంతి సందర్భంగా పట్టణంలోని బొట్టుగూడ వాల్మీకినగర్‌లో వాల్మీకి విగ్రహ పునఃప్రతిష్ఠాపన మహోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు గుమ్మల మోహన్‌రెడ్డితో కలిసిన ఆయన పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో కాలనీవాసులు, నాయకులు పాల్గొన్నారు.

కట్టంగూర్ : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో మహర్షి వాల్మీకి జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ జ్ఞానప్రకాశ్‌రావు వాల్మీకి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీఓ చింతమల్ల చలపతి, ఏపీఓ కడియం రాంమోహన్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

చిట్యాల : పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం వాల్మీకి మహర్షి జయంతిని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి ఎంపీడీఓ ఎస్‌పీ.జయలక్ష్మి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపీఓ ఏ.రమేష్, ఏపీఓ వి.శ్రీలత, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మర్రిగూడ : రామాయణాన్ని రచించిన వాల్మీకి మహర్షి జయంతిని గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ జి.చినమునయ్య వాల్మీకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సూపరింటెండెంట్ యాకుబ్, ఎంపీఓ రవికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ వెంకటేశ్వర్లు, మాజీ సర్పంచ్ నక్క వెంకటయ్య, కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.

శాలిగౌరారం : మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం వాల్మీకి జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో తహసీల్దార్ యాదగిరి, ఎంపీడీఓ గార్లపాటి జ్యోతిలక్ష్మి, ఎంపీఓ పద్మ, ఏపీఓ జంగమ్మ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


కట్టంగూర్ : వాల్మీకి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ జ్ఞానప్రకాశ్‌రావు


నకిరేకల్ : వాల్మీకి జయంతిలో పాల్గొన్న అధికారులు


చిట్యాల : ఎంపీడీఓ కార్యాలయంలో నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ జయలక్ష్మి


మర్రిగూడ : వాల్మీకి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీడీఓ చినమునయ్య

ఏడు టిప్పర్‌లు సీజ్

నార్కట్‌పల్లి : అనుమతులు లేకుండా మట్టిని తరలిస్తున్న ఏడు టిప్పర్లను పట్టుకుని సీజ్ చేసినట్లు ఎస్‌ఐ క్రాంతికుమార్ గురువారం తెలిపారు. వివరాల ప్రకారం.. పట్టణ పరిధిలోని వివేరా హోటల్ వెనుక నుంచి మట్టిని తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం రావడంతో వారు అక్కడకు చేరుకోని వివరాలు సేకరించి వాహనాలను సీజ్ చేసి మైనింగ్ అధికారులకు అప్పగించినట్లు ఆయన తెలిపారు. మండలంలో చెరువుల నుంచి గాని కాల్వల పక్క ఉన్న మట్టినిగాని అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్‌ఐ హెచ్చరించారు.

ఇందిరమ్మ కమిటీలు పారదర్శకంగా ఉండాలి

కేతేపల్లి : ఇందిరమ్మ ఇళ్లు, ఇతర సంక్షేమ పథకాలకు లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు ఏర్పాటు చేస్తున్న ఇందిరమ్మ కమిటీలలో పారదర్శకంగా వ్యవహరించే సభ్యులను నియమించాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు బొజ్జ చినవెంకులు ప్రభుత్వాన్ని కోరారు. గురువారం మండల కేంద్రంలో నిర్వహించిన పార్టీ మండల ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కమిటీలు రాజకీయాలకు అతీతంగా పనిచేస్తేనే సంక్షేమ పథకాల అమలులో అర్హులైన లబ్ధిదారులకు న్యాయం జరుగుతుందన్నారు. సమావేశంలో పార్టీ మండల కార్యదర్శి సీహెచ్.లూర్దుమారయ్య, నాయకులు వీరబోయిన సాదయ్య, బి.అంజయ్య, జటంగి లింగయ్య, నాగమళ్ల వెంకన్న, జోజి పాల్గొన్నారు.

రానున్న రోజుల్లో తెలంగాణలో బీజేపీదే అధికారం

మునుగోడు : రానున్న రోజుల్లో తెలంగాణలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి తీరుతుందని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బోడిగె అశోక్‌గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం మండలంలోని కిష్టాపురం గ్రామంలో ఆ పార్టీ కార్యకర్తలకు సభ్యత్వాలు అందజేసి ఆయన మాట్లాడారు. దేశంలో అధికారంలో కొనసాగుతున్న బీజేపీ ప్రభుత్వం పేద ప్రజల సంక్షేమానికి అనేక పథకాలు ప్రవేశపెట్టి అందిస్తుందన్నారు. వాటిని అర్హులు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని ఆయన కోరారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు పెంబళ్ల జానయ్య, ఉపాధ్యక్షుడు బ్రహ్మచారి, ఏర్పుల క్రాంతికుమార్, బొమ్మకంటి నర్సింహ, నెల్లికంటి రమేష్, నందిపాటి రవి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

- ఎమ్మెల్యే వేముల వీరేశం


నకిరేకల్ : మంగళపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే వేముల వీరేశం


నార్కట్‌పల్లి : శాపల్లిలో..


కట్టంగూర్ : అయిటిపాములలో..

నకిరేకల్ : ప్రభుత్వం గ్రామాల్లో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. గురువారం మండలంలోని మంగళపల్లి, చందంపల్లి గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ధాన్యం తూకాల విషయంలో ఇబ్బందులు జరుగుతున్నట్లు రైతులు తన దృష్టికి తెచ్చినందున ఇక నుంచి అలాంటి సమస్యలు రాకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తూ కొనుగోళ్లు వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ శేఖర్‌రెడ్డి, డీపీఎం మోహన్‌రెడ్డి, తహసీల్దార్ జుమురుద్దీన్, ఎంపీడీఓ చంద్రశేఖర్, మండల ప్రత్యేక అధికారి డాక్టర్ కిరణ్‌కుమార్, మాజీ ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవి గంగాధర్‌రావు, ఏపీఓ నరహరి, సీసీలు స్వరూప, పద్మ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నకిరేకంటి ఏసుపాదం, పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి : మండలంలోని పలు గ్రామాల్లో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఎమ్మెల్యే వేముల వీరేశం గురువారం ప్రారంభించి మాట్లాడారు. రైతులకు కొనుగోలు కేంద్రాలలో మౌలిక సదుపాయాలు కల్పించాలని నిర్వాహకులకు సూచించారు. గన్నీబ్యాగుల కొరత లేకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు, ఎంపీడీఓ సుధాకర్, ఏపీఎం శ్రీదేవి, మాజీ ఎంపీపీ పబ్బతిరెడ్డి వెంకట్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కసిరెడ్డి మధుసూదన్‌రెడ్డి, నాయకులు సట్టు సత్తయ్య, బండా సాగర్‌రెడ్డి, జేరిపోతుల భరత్, దూదిమెట్ల సత్తయ్య, ఇంద్రరెడ్డి, సిద్దగోని స్వామి, గాయం శ్యాంసుందర్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, రేగట్టే నర్సిరెడ్డి, దొండ రమేష్, బద్దం రాంరెడ్డి, పశుపతి, శౌరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

కట్టంగూర్ : మండలంలోని అయిటిపాముల, కురుమర్తి, చెర్వుఅన్నారం గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని డీఆర్‌డీఓ శేఖర్‌రెడ్డితో కలిసి ఎమ్మెల్యే వేముల వీరేశం గురువారం ప్రారంభించి మాట్లాడారు. రైతులు దళారులకు ధాన్యం అమ్మి మోసపోవద్దన్నారు. ప్రభుత్వం ఏ గ్రేడ్ ధాన్యానికి రూ.2320, సాధారణ రకానికి రూ.2300 మద్దతు ధర నిర్ణయించిందన్నారు. కేంద్రాల్లో రైతులకు సరిపడా మౌలిక వసతులు కల్పించాలని సంఘబంధం సభ్యులకు ఆయన సూచించారు. లారీలు, హమాలీల కొరత లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం రూ.500 బోనస్ ఇస్తుందని, సన్నధాన్యం రైతులకు కట్టంగూర్‌లో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంఎస్‌ఓ కోటేశ్వర్‌రావు, తహసీల్దార్ గుగులోతు ప్రసాద్, ఎంపీడీఓ జ్ఞానప్రకాశ్‌రావు, మాజీ జెడ్పీటీసీ మాద యాదగిరి, పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది సుక్కయ్య, డీపీఎం మోహన్‌రెడ్డి, ఏపీఓ రాంమోహన్, పెద్ది యాదగిరి, రెడ్డిపల్లి సాగర్, శ్రీనివాస్‌రెడ్డి, ఏపీఎం సైదులు, సీసీఎస్ శంకర్, వెంకన్న, కొనుగోలు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

శ్రీపాల్‌రెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలి


ఓటు నమోదు పత్రాలతో అవగాహన కల్పిస్తున్న పీఆర్‌టీయూ నాయకులు

చిట్యాల : నల్లగొండ, ఖమ్మం, వరంగల్ జిల్లాల నియోజకవర్గ పీఆర్‌టీయూ టీఎస్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి పింగళి శ్రీపాల్‌రెడ్డికి ఉపాధ్యాయులంతా మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు డీవీఎస్ ఫణికుమార్ కోరారు. గురువారం మండలంలోని చిట్యాల, వెలిమినేడు జెడ్పీహెచ్‌ఎస్‌లలో ఓటు నమోదుపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. నవంబర్ 6వతేదీలోపు ఉపాధ్యాయులంతా తమ ఓటరుగా నమోదు చేయించుకోవాలని సూచించారు. అనంతరం సంఘం జిల్లా మాజీ అధ్యక్షుడు, జిల్లా ప్రధాన కార్యదర్శి సుంకరి భిక్షంగౌడ్, మేకల జానారెడ్డి మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారంలో సంఘం ముఖ్యపాత్ర పోషిస్తుందన్నారు. కార్యక్రమంలో సంఘం మండల అధ్యక్షుడు కంచరకుంట్ల సుధాకర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి కోమటిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర, జిల్లా, మండల అసోసియేట్ అధ్యక్షులు బాదం భిక్షపతి, చిలకరాజు శ్రీనివాస్, వెంకట్రావు, మహిళా ఉపాధ్యక్షురాలు అజిత, హెచ్‌ఎంలు గోగికార్ మాధవి, వై.నర్సిరెడ్డి, ఉపాధ్యాయులు సైదులు, నాగరాజు, దారా గోవర్ధన్, వెంకట్‌రెడ్డి, శరత్, శ్రీనివాచారి పాల్గొన్నారు.


నల్లగొండ మున్సిపాలిటీలోని 30వార్డు ఉస్మాన్ పుర నుంచి గంధం తీసుకెళ్తున్న మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మోహన్‌రెడ్డి, వార్డు కౌన్సిలర్ నవీన్‌కుమార్ గౌడ్

ప్రజా సమస్యలను పరిష్కరించాలి


వర్మీకంపోస్ట్‌ను పరిశీలిస్తున్న వేణుగోపాల్

మర్రిగూడ : ప్రత్యేకాధికారుల పాలనలో ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని మునుగోడు ఏడీఏ, మర్రిగూడ ప్రత్యేకాధికారి బి.వేణుగోపాల్ అన్నారు. గురువారం మండలంలోని యరగండ్లపల్లి గ్రామంలో పాఠశాల, అంగన్‌వాడీ, డంపింగ్‌యార్డు, నీటి సరఫరా, గ్రామానికి సంబంధించిన పలు రికార్డులను ఆయన పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ప్రజాప్రతినిధులు ఎన్నికయ్యేంతవరకు ప్రత్యేకాధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించి ప్రజల మన్ననలను పొందాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ జి.చినమునయ్య, ఎంపీఓ రవికుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి ఇ.శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

నకిరేకల్ : పెండింగ్‌లో ఉన్న రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఖమ్మంపాటి శంకర్, జిల్లా అధ్యక్షుడు ఆకారపు నరేష్ డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతుందన్నారు. సమావేశంలో సంఘం డివిజన్ కార్యదర్శి ముస్కు రవీందర్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

మర్రిగూడ : ద్విచక్రవాహనాన్ని ట్రాక్టర్ ఢీకొట్టిన ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని సరంపేట క్రాస్‌రోడ్డు వద్ద గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గట్టుప్పల్ మండలంలోని అంతంపేట గ్రామానికి చెందిన సొప్పరి సైదులు తన భార్య సంతోషతో పాటు అదే గ్రామానికి చెందిన నేలపట్ల ముత్తమ్మతో కలిసి గ్యాస్ సబ్సిడీ కోసం మండల కేంద్రానికి ద్విచక్రవాహనంపై వస్తున్నారు. అదే సమయంలో సరంపేటకు చెందిన ట్రాక్టర్ పొలం పనులను ముగించుకోని డ్రైవర్ ట్రాక్టర్‌ను రోడ్డుపైకి తీసుకువస్తున్న క్రమంలో ద్విచక్ర వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సైదులు, ముత్తమ్మలకు తీవ్రగాయాలు కాగా సంతోషకు స్వల్ప గాయాలయ్యాయి. వారిని ప్రథమ చికిత్స నిమిత్తం మర్రిగూడ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు.

ఆర్థికసాయం అందజేత

నాంపల్లి : మండలంలోని తుంగపహాడ్ గ్రామానికి చెందిన బైరమోని లక్ష్మమ్మ గురువారం అనారోగ్యంతో మృతి చెందింది. మృతురాలి కుటుంబాన్ని గ్రామానికి చెందిన నేతళ్ల కొండల్ పరామర్శించారు. అనంతరం రూ.10వేల ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో దండిగా అలివేలునర్సింహ, కొమ్ము వెంకటయ్య, కృష్ణయ్య ఉన్నారు.

మండలంలోని నేరళ్లపల్లి గ్రామానికి చెందిన జేరిపోతుల లక్ష్మమ్మ అనారోగ్యంతో గురువారం మృతి చెందింది. మృత్యురాలి కుటుంబాన్ని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ గఫర్ పరామర్శించారు. అనంతరం రూ.10వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో రమేష్, సత్తయ్య ఉన్నారు.